# 'నాయుడుగారి వీరభద్రం' అనే ఒక కోడిపుంజు కథ

జాన్‌సన్ చోరగుడి



నిన్నటిదా మొన్నటిదా, పదేళ్ళనాటి కథ ఇది. అసలు ఇది వెలుగు చూస్తే కదా ఎవరో ఒకరికైనా ఇది తెలిసేది. అటువంటిది ఇన్నాళ్ళ తర్వాత ఇప్పుడిలా ఊహించనిరీతిలో 'కాకా' పునఃప్రవేశంతో మళ్ళీ ఇది తెరమీదికొచ్చింది. రావడం రావడమే పగలబడి నవ్వుకుంటూ ఒక చేత్తో పొట్టను అదిమి పట్టుకుంటూ మరొక చేత్తో మడిచిన ఆరోజు పేపర్‌ను గాలిలో ఊపుకుంటూ ముందుకు వంగుతూ లేస్తూ తనని తానే తమాయించుకునే ప్రయత్నం చేస్తూ ప్రత్యక్షమయ్యాడు కాకా. కథ సంగతి సరే అనుకుని, ఇంతకీ నీ చేతిలో ఉన్న పేపర్లో ఏముందని అడిగితే- 'ఈ బ్యానర్ న్యూస్ చూడు' అంటూ పేపర్ నా ఒళ్ళో పడేసి, వస్తున్న నవ్వును అపుకుని, రెండు చేతుల్తో పొట్టను పట్టుకుంటూ నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడ్డాడు. వార్త చూశాను భారత్‌లోకి బర్డ్ ఫ్లూ ప్రవేశం! కుప్ప కూలిన పౌల్ట్రీ పరిశ్రమ చూసిన వార్తే అయినా అది నాకు కాకా ప్రత్యేకం చూపించడంతో ఒక్కసారిగా స్థాణువయ్యాను. కొన్ని క్షణాలు ఆలోచించాను. చివరికి తప్పనిసరి అయ్యి మళ్ళీ ఈ కథను నాలోనుండి నేను బయటకు తీయాల్సివచ్చింది. ఇంకా ఇప్పటికీ కాకా మీముందుకు రావడాన్ని నేను అనుమతించకపోవడం నాకు కూడా భావ్యం కాదనిపించింది. అందుకే విజిల్ వేసి తెరలు పక్కకు తొలగించమని, కాకాను రంగస్థలం మీదికి వెళ్ళమని సైగచేసి దీని ప్రయోక్తగా నేను పక్కకు తప్పుకుంటున్నాను.

** ** **

తొలికోడి కూతకు ముందే 'కాకా'కు మెలకువ వచ్చేసింది. అలవాటుగా 'అత్త' వైపు చూశాడు. తను మునగతీసుకుని మరీ నిద్ర పోతోంది. కాని అది మగత నిద్ర అని పసికట్టిన కాకా తనని లేపడానికి అన్నట్టుగా ఆర్తిగా తడుముతూ నెమ్మదిగా దగ్గాడు. 'అత్త' కళ్ళు తెరిచింది. రాత్రి అంతా ఆ బాహువుల క్రింద వెచ్చగా నిద్రపోయినా తెలవారితే మాత్రం ఈ ఎడబాటు తప్పదుకదా, అని ఒళ్ళు విరుచుకొంటూ కాకా కళ్ళలోకి చూసింది అత్త. మళ్ళీ రాత్రికి కల్సుకుందాం అన్నట్టుగా 'అత్త'వైపు చూస్తూ అప్పటికే తలుపు తెరిచి మరీ నిలబడ్డాడు 'కాకా'. అత్త క్షణాల్లో అక్కణ్ణించి అదృశ్యమయింది. వారాలు నెలల లెక్క అయితే తెలియదు గాని చానాళ్ళుగా రాత్రి బాగా పొద్దుపోయాక అత్త కాకా వద్దకు రావడం అక్కడే ఉండిపోవడం తెల్లవారకముందే అక్కణ్ణించి వెళ్ళిపోవడం ప్రతి రాత్రీ జరుగుతూనే వుంది. ఏవిధంగా అర్థం చేసుకోవడానికి అంతుపట్టని వీరిద్దరిమధ్య ఉన్న అనుబంధం ఏమిటో తెల్సుకోవడానికి మాత్రం మనం ఒక్కసారిగా వెనక్కి వెళ్ళాల్సిందే...

** ** **

ఎన్ని మెరుపులు మెరిశాయో ఎన్ని పిడుగులు పడ్డాయో ఎన్ని దుక్కులు వాన కురిసిందో ఎవరికి లెక్క? మిన్నూ మన్నూ ఏకమైపోయింది. ఊళ్ళు సెలయేళ్ళు అయ్యాయి. ఆకాశం విచ్చుకుని కురిసిన జలధారకు అడివి కూడా అల్లాడింది. వందల కొద్దీ బిందెలు తలపై కుమ్మరించుకుని స్నానించిన వితంతువులా తల్లడిల్లిన ప్రకృతి మళ్ళీ ఇప్పుడిప్పుడే తెప్పరిల్లుతుంది. కంటికి ఎండ కన్పించకపోయినా రోజంతా గోరువెచ్చని వేడి తగులుతూ రేపటికి మరింకాస్త పెరుగుతాను అని హామీ ఇస్తూవుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మర్నాడు ఎండ ఫెళ్ళున కాసింది. ఆ ఎండలో కనుచూపుమేర ఉన్న పచ్చదనమంతా బంగారు ఉంగరంలోని ఆకుపచ్చని చెక్కుడు రాయిలా ధగధగ మెరిసింది. పేరుకుపోయిన దుమ్ము, ధూళిని శుభ్రంగా కడుక్కున్న ఆకాశం నీలంగా నిశబ్దంగా ఉంది. భూమ్యాకాశాల మధ్య చోటు చేసు కున్న నిశబ్దానికి భంగం కలగకుండా తెల్లని కొంగల బారులు గుంపులు గుంపులుగా బయలుదేరాయి. అడివి అంచుకున్న కొండకు దిగువన, సెలయేటికి ఎగువన ఉన్న ఆ గ్రామం తడిసిన చిక్కని కురులను ఎండలో ఆరబెట్టుకుంటున్న పడుచులా ఉంది. సమయం ఉదయం తొమ్మిది గంటలు దాటింది. ఇన్నాళ్లూ చావిళ్ళలోనే ఉండి కాళ్ళకు ఉరులు దిగిన గొడ్లు ఒక్కసారిగా తలలు ఊపుకుంటూ వీధుల్లోకి వస్తున్నాయి. ఆడంగులు వాకిళ్ళలో వాల్చిన మంచాలమీద ముక్కవాసన వస్తున్న గుడ్డల్ని ఎండలో ఆరబెట్టుకుంటున్నారు. రాజేసిన పొయ్యిల్లో నుంచి బయల్దేరని పొగ తడిసి ముద్దయిన ఇళ్ళకప్పుల్లో నుంచి బద్ధకం గా బయటకు వస్తున్నది. అటువంటి ఒకానొక సమయంలో- 'నాటు కోళ్ళు కొంటాం, నాటు కోళ్ళు కొంటాం...!' అంటూ పెద్ద గొంతుతో పెట్టిన కేక విన్పించింది. ఊరికి ఎడంగా ఉన్న వాముల దొడ్డి దిబ్బల మీద అప్పటికి లెక్కలేనన్ని సార్లు రెక్కలు సాచి గొంతెత్తి క్కొక్కొక్కొ...... అంటున్న పంచ రంగుల పుంజు ఒకటి ఠక్కున అరవడం ఆపి చెవులు రిక్కించి రెండు వైపులకు మెడను సాచి మరీ తిప్పుతూ కళ్ళను మరింత పెద్దవిచేసి చూసింది. మళ్ళీ అదే కేక- 'నాటు కోళ్ళను కొంటాం... నాటు కోళ్ళను కొంటాం...!'

** ** **

కథ

ఆ రాత్రి వాన కురిసి వెలిసిన తర్వాతి రాత్రేమో నిశబ్దంగా ఉంది. ఆ నిశబ్దంలో నుంచి కీచురాళ్ళ రొద క్షణం విరామం లేకుండా చెవుల్లో సన్నని సూదులు పొడిచినట్టుగా ఉంది. ఊరికి చివర పొలాలకు దగ్గర ఉన్న మెట్ట పొలం నాయుడు దోడ్లోని గొడ్లు కళ్ళు మూసుకుని మరీ నెమరు వేస్తున్నాయి. ఆ చావిట్లోనే మరో చివర ఉన్న కోళ్ళ గదిలో ఉన్న కోళ్ళు మాత్రం రాజుగారి హుండీకి పహరా కాస్తున్న జవానుల్లా ఎర్రబారిన కళ్ళతో ఆ రాత్రి జాగారం చేస్తున్నాయి. చిన్నా పెద్దా కలిసి సుమారు ముప్పై వరకు కోళ్ళున్న గది అది. అవి సౌకర్యంగా ఉండటానికోసం ఆ గదిలో అడివి కర్రలతో కట్టి బంకమట్టి వడ్ల పొట్టుతో మెత్తిన అరవలున్నాయి. ఇంటి యజమాని నాయుడు భార్యకు తరచూ కోళ్ళ గదిని పేడతో అలికే శుభ్రం ఉంది. స్వేచ్ఛగా వాటికి ఎక్కడ నచ్చితే అక్కడ ఉండే విశాలమైన గది అది. పంచ రంగుల కోడిపుంజు అంతకు మునుపే ఆ కోళ్ళను ఉద్దేశించి మాట్లాడి చివరిగా ఒక ప్రశ్న వేసి- మిగతావాటి జవాబు కోసం కనిపెడుతున్నది. ఆ ప్రశ్నకు ఎవరికి వాళ్ళు అవాక్కయి తిరిగి ఏమి సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతున్న ఉద్విఘ్న క్షణాలవి. కీచురాళ్ళ రొద తప్ప అక్కడ మరే అలికిడీ లేదు. మళ్ళీ పంచ రంగుల పుంజే మాట్లాడ్డం మొదలుపెట్టింది.

'ఏం ఎందుకు నోళ్ళు మెదపకుండా మిన్నకుండారు? పొద్దున  వాడు, ఆ కోళ్ళు కొనే వాడు వేసిన కేక మీరు విన్నారా వినలేదా?' సూటిగా అడిగింది పుంజు.

'విన్నా' ఓ అరకోడి చొరవ చేసింది.

'వింటే మరి నేను అడిగిందానికి జవాబు చెప్పరేం...' కంగుమంది పుంజు గొంతు.

పెట్టలు అరకోడి వంక ఊరుకో మాట్లాడకు అన్నట్టుగా చూశాయి. కొన్ని క్షణాలు అక్కడ నిశబ్దం చోటు చేసుకుంది. పుంజు గొంతు సవరించుకుంటూ మాట్లాడ్డం మొదలు పెట్టింది.

'వాడేం అన్నాడు?... నాటు కోళ్ళు కొంటాం' అన్నాడు. అంతేనా, అదే మళ్ళీ మిమ్మల్ని అడుగుతున్నాను,

మనం ఏమిటి?

మనదేం జాతి?

మనం కోళ్ళం.

మనజాతి కోళ్ళ జాతి.

ఇక ఇందులో పెట్ట- పుంజు- అరకోడి- పిల్ల గుడ్డు- అంటూ సవాలక్ష ఉండొచ్చు.

కాని- మనం కోళ్ళం.

ఎంతకాలం నుంచీ మనం కోళ్ళుగా ఉన్నది?

ఈ సృష్టి పుట్టినప్పణ్ణించీ మనం- కోళ్ళమే.

ఎన్ని తరాలు ఇలా గడిచిపోయాయో లెక్క ఉందా ఎవరి దగ్గరయినా?

అటువంటి మనం, మన కోళ్ళం, మనకు తెలియకుండానే- మనం నాటుకోళ్ళం ఎప్పుడయ్యాం?

అయినా మనం నాటుకోళ్ళమో, నీటుకోళ్ళమో ఎంచేదెవడు?

అందుకు వాడికున్న అర్హత ఏమిటి?

అసలు వాడికా హక్కు ఇచ్చిందెవడు?

సృష్టి మొదలైనప్పటినుండీ లేనిది ఇప్పుడు ఈ క్రొత్త బిరుదు 'నాటు' మన పేర్ల పక్కన ఎందుకొచ్చి చేరింది.

నిన్న కాక మొన్న క్రొత్తగా ఎక్కణ్ణించో వచ్చినవాణ్ణి తెచ్చి మన నెత్తిమీద కూర్చోబెట్టమట్టే కదా మనం ఇవ్వాళ నాటు అయింది.

ఏమిటి నాటు? ఇక్కడ పుట్టడం నాటా?

చూడండి-

మన నాయుడు అమ్మా నాన్నలకు ఎలా పుట్టాడో,

ఆ కోళ్ళను కొనడానికి వచ్చినవాడు వాళ్ళ అమ్మా నాన్నలకు ఎలా పుట్టాడో మనమూ అలాగే

**మనలో ప్రతిఒక్కరికీ తెలుసు తొలకరి వానలు కురవగానే సందకాడ ఎక్కణ్ణించి పుట్టుకొస్తాయో తెలియదు. వీధి దీపాల క్రింద రెక్కలు అల్లార్చుకుంటూ వస్తాయి- ఉసిళ్ళు. మరి ఆ వెలుతురును అవి ఏమని భ్రమిస్తాయో కాని తెల్లవారేసరికి నేలమీద నిర్జీవాలై పడివుంటాయి. వాటికి ఒక ఉనికి అనేది ఉందని మనం అనగలమా?**

పుట్టాం.

మన పిల్లలకు వాటి తల్లి తెలుసు, మన తల్లికి మన తండ్రి ఎవరో తెలుసు.

ఈ నేలలో పుట్టినవాళ్ళం మనం.

ఎవరో వండి వార్చి ముక్కులకు అందిస్తుంటే కూర్చుని తినేరకం కాదు మనం.

రోజంతా కష్టించి ఆహారాన్ని సేకరించుకుని మరీ బతుకుతున్నవాళ్ళం మనం.

తల్లి ఒడిని వదలి ఇవతలకు వచ్చింది మొదలు మళ్ళీ తల్లిదండ్రులమయ్యేంత వరకు ఒంటరి పోరాటం మనది.

ఒంటరి పోరాటమే కాదు- స్వతంత్రమైన జీవనం మనది.

ఒక్క ప్రకృతి ముందు తప్ప మరింకే ఒక్కరికీ తలొగ్గవలసిన పూచీలేని జీవులం మనం.

అటువంటిది ఈ ప్రకృతిలో భాగమై ఈ పరిసరా లలో ఒకరిమై, జీవనం గడుపుతున్న మనం- ఏ విధమైన స్వంత ఉనికి స్వతంత్రంలేని, వెన్నెముకలేని ప్రాణులు వంటి వాటిక్రింద నాటు జీవులంగా బ్రతకడ మా?

ఆహారాన్ని సమకూర్చుకోలేవు.

ప్రకృతి సహజమైన సంపర్క స్పందనలు తెలియవు.

పిల్లల్ని కనడం తెలియదు, పెంచడం తెలియదు,

ఎందుకు?


'ఎందుకు ఎందుకు అవి మనకంటే పైన ఉండాలి?'

మనలో ప్రతిఒక్కరికీ తెలుసు తొలకరి వానలు కురవగానే సందకాడ ఎక్కణ్ణించి పుట్టుకొస్తాయో తెలియదు. వీధి దీపాల క్రింద రెక్కలు అల్లార్చుకుంటూ వస్తాయి- ఉసిళ్ళు. మరి ఆ వెలుతురును అవి ఏమని భ్రమిస్తాయో కాని తెల్లవారేసరికి నేలమీద నిర్జీవాలై పడివుంటాయి. వాటికి ఒక ఉనికి అనేది ఉందని మనం అనగలమా? ఇప్పుడు మన పైన తెచ్చిపెట్టిన వాటికి మాత్రం ఇంతకుమించిన స్థాయి ఏమైనా ఉందా?

లేని- రాని తామతును వాటికి ఆపాదించడానికి గాను, ఒక జాతికి ప్రతినిధులుగా ఉన్న మనల్ని 'నాటు' కోళ్ళం అని పిలవడం ఎటువంటి న్యాయమ వుతుంది? ఎటువంటి సంస్కారమవుతుంది?'

పంచ రంగుల పుంజు విరామం తీసుకుంది.

గది అంతా నిశబ్దం. సమయం ఎంతైందో తెలియదు. బయట కీచురాళ్ళ రొద అలా గే ఉంది. అప్పుడు ఆగదిలో ఒక మూల నుండి



ఆగకుండా మోగుతున్న చప్పట్లు విన్పించాయి. అక్కడున్న అందరి దృష్టి అటు వైపుకు మళ్ళింది. అందరితోపాటు పంచరంగుల పుంజు కూడా లోపలికి వచ్చిన అతిథిని చూసి స్థాణువు అయింది. కొంతసేపటి వరకు పుంజుకు నోరు పెగల్లేదు. లోపలికి వచ్చిన అతిథే చొరవ తీసుకని అంది- 'శభాష్ 'కాకా' నువ్వు దీనికి చెప్పిన ప్రతి మాటతోనూ నేను ఏకీభవిస్తున్నాను. ఏ ఆలోచనలకు నా సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాను. అయితే దీనికి కొనసాగింపుగా నేను చెప్పవలసింది కూడా ఉంది. కానీ దానిని నేను రేపు చెబుతాను. మీరు అనుమతిస్తే రేపు ఇలాగే ఇక్కడే కల్సుకుందాం. మన చర్చను తిరిగి కొనసాగిద్దాం అంటూ నిష్క్రమించింది. అకస్మాత్తుగా వారి మధ్యకు వచ్చి వెళ్ళిన ఆ అతిథి- నత్త. కోళ్ళు ఉంటున్న ఆ చావిడికి సమీపంగా ఉన్న పంటకాల్వలోంచి వచ్చిన ఆ నత్త మళ్ళీ తిరిగి అక్కడికే చేరు కుంది.

పంచ రంగుల పుంజును మర్నాటి నుండి చిన్నా పెద్దా అంతా 'కాకా' అని పిలవడం మొదలుపెట్టారు. అలా పిలిపించుకోవడం తనకీ బాగానే ఉందనిపించింది. ఆ రాత్రి ముందురోజుకంటే వేగిరంగానే వచ్చింది నత్త. గుమ్మంలోనే దాన్ని చూసిన అరకోళ్ళు పిల్లకోళ్ళు అన్నీ కలిసి కోరస్‌గా- 'అత్తకు స్వాగతం' అంటూ రాగయుక్తంగా అన్నాయి. ఆ అనుభవానికి అత్త మనస్ఫూర్తిగా ముచ్చట పడింది. అంతా సర్దుకుని కుదుట పడ్డాక కాకా అత్తవైపు తిరిగి నువ్వు చెప్పాలనుకున్నదేదో ఇక మొదలుపెట్టవచ్చు అన్నట్టుగా చూశాడు.



** ** **

పంచ రంగుల పుంజును మర్నాటి నుండి చిన్నా పెద్దా అంతా 'కాకా' అని పిలవడం మొదలుపెట్టారు. అలా పిలిపించుకోవడం తనకీ బాగానే ఉందనిపించింది. ఆ రాత్రి ముందురోజుకంటే వేగిరంగానే వచ్చింది నత్త. గుమ్మంలోనే దాన్ని చూసిన అరకోళ్ళు పిల్లకోళ్ళు అన్నీ కలిసి కోరస్‌గా- 'అత్తకు స్వాగతం' అంటూ రాగయుక్తంగా అన్నాయి. ఆ అనుభవానికి అత్త మనస్ఫూర్తిగా ముచ్చట పడింది. అంతా సర్దుకుని కుదుట పడ్డాక కాకా అత్తవైపు తిరిగి నువ్వు చెప్పాలనుకున్నదేదో ఇక మొదలుపెట్టవచ్చు అన్నట్టుగా చూశాడు.

అత్త మాట్లాడుతోంది-

'అస్సలు సిసలు కోళ్ళయిన మిమ్మల్ని నాటుకోళ్ళు అని పిలవడం మీ ఆత్మగౌరవం పోగొట్టుకోవడం అంటూ కాకా మిమ్మల్ని అర్థదర్శీ జాగ్రత్తపర్చడం నిన్న నేను స్వయంగా విన్నాను చూశాను.

అయితే నేస్తాల్లారా మాది మరింత దయనీయమైన పరిస్థితి.

భౌతికంగా మా ఉనికే కొంత కాలంగా ప్రశ్నార్థకమయింది.

ఈ సృష్టిలో చిన్న చేపను పెద్ద చేప మింగడం అనే ప్రకృతి ధర్మం మనకందరికీ తెల్సిందే- ఆమోదమయిందే. కాని మా జాతి విషయంలో సమస్య అది కాదు. చేపలు రొయ్యలు కప్పలు తాబేళ్ళు మా నత్తలు మేమంతా నీళ్ళలో ఉంటున్నామంటే ఎవరి బతుకు వాళ్ళు బతుకుతున్నాం. అలాగే ఎవరి ఆత్మరక్షణ పద్ధతులు వాళ్ళకున్నాయి. నీటిలో ఉన్నంతకాలం ఉంటాం ఆయుష్షు తీరింది అన్నప్పుడు పోతాం. ఎవరికి ఏది శాశ్వతం కనుక?!

కానీ ఈ మనిషి ఉన్నాడే

వీడి దాష్టీకం కొంత కాలంగా మా మీద ఎక్కువయింది.

నైతికంగా తనకు ఎటువంటి సంబంధంలేని అంశాల్లోకి అతడు వేళ్ళు పెట్టడం ఎక్కువయింది. ఇన్ని భిన్న జాతులం మేమంతా నీటిలో ఉంటున్నామంటే మాకు ఎవరి ఆవాసాలు వారికున్నాయి. ఎవరూ మరొకరి జీవావరణంలోకి వెళ్ళాల్సిన పనిలేదు. ఇక మాలో ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ అంటే మా వరకు మాకు ఆ ప్రసక్తే ఉత్పన్నం కాదు. ఎందుకంటే మేం ఎవరు ఒకరికంటే తక్కువా కాదు, ఒకరికంటే ఎక్కువా కాదు. కాని జరుగుతున్నది ఏమిటి? మా నత్త జాతిని ఈ మనిషి వేటాడుతున్నాడు. పోనీ అది తన ఆహారంకోసమా అంటే అదీకాదు. మమ్మల్ని పట్టి మాకు సహజ రక్షణ కవచంగా మా శరీరం మీద ఉన్న పెంకును పగలగొట్టి, మేమింకా కొన ఊపిరితో ఉండగానే మమ్మల్ని రొయ్యలకు చేపలకు ఆహారంగా వేస్తున్నాడు. రొయ్యకు గానీ చేపకు గానీ నన్నే కనుక తినాలనిపిస్తే- వాటిని నన్ను చంపి తినమనండి. అంతేకాని మధ్యలో వీడెవడు, నాకున్న సహజ రక్షణ తొలగించి నన్ను వాటికి తిండిగా వేయడానికి. అవి నన్ను తినడమా లేక నేను వాటిని తినడమా అనేది అది మా ఇద్దరి మధ్య తేలవలసిన విషయం. మా ఇద్దరి ఉనికే కనుక ప్రశ్న అయితే- మాలో ఎవరు ఉండాలి అనేదే అంతిమంగా తేలాల్సి వస్తే, మా ఇద్దరికీ కూడా సమాన అవకాశాలు కల్పిస్తే అప్పుడు మేము ఏమిటో మేం నిరూపించుకుంటాం. మా ఇద్దరిలో అంతిమ విజేత ఎవరో వాళ్ళకే ఓడినవాళ్ళు ఆహారమవుతారు. దానికి ఎటువంటి ఆక్షేపణ లేదు.

కాని జరుగుతున్నది అది కాదు!

సహజంగా నాకున్న రక్షణ కవచాన్ని నాకన్నా బలమైనవాడి చేతిలో ధ్వంసం చేయించి, నాకన్నా బలహీనుడైన ఒక అర్భకుడికి నన్ను ఆహారం కమ్మంటే, అది ఎంత గొప్ప ప్రకృతి ధర్మం?

ఇంతకన్నా అన్యాయం ఇంకేమైనా ఉంటుందా?'

అత్త గొంతు ఒక్కసారిగా గద్గదమయ్యింది-

'అయినా మన జాతులు పుట్టినప్పట్నించీ మనతో కలిసి మమేకమై మనలో ఒకడిగా బతికిన ప్రకృతి మనిషి ఇప్పుడేడి? అతడెక్కడా కన్పించడేమి?

ప్రకృతిలో విస్తారంగా తనకు కలిగినవాటితో అతడు ఎందుకు తృప్తి చెందలేకపోతున్నాడు?

మైదానాలు అతడికోసమే- సరస్సులు అతడికోసమే కదా.

అయినా అతడికి ఎందుకీ ఆరాటం.

సరస్సులు వాటి పర్యావరణం కాపాడుకుంటేనేగా- మైదానంలో నువ్వు క్షేమంగా ఉండగల్గింది'.

'నీ చెరువులో రొయ్యకు వైరస్ వస్తే నీకు భయం-

నీ పౌల్ట్రీలో కోడికి బర్డ్ ఫ్లూ వస్తే నీకు భయం-

నీ పొలంలోని పంటకు తెగులు వస్తే నీకు భయం-

ఇక నీకు భయం లేనిదెప్పుడు?-

నాకూ ధైర్యం ఉందని, ఇక నువ్వు అనగలిగేది ఎప్పుడు?

ప్రకృతిని ధ్వంసం చేస్తున్నప్పుడు, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నప్పుడు అంతేగా?

నా జీవిత కాలమంతా నేను నీకు చేస్తున్న మేలును మరచి నా జాతి ఉనికి లేకుండా చేయడానికి నువ్వు సిద్ధమయ్యావు'...

అత్తకు మాటలు పెగల్లేదు. గదిలోని కోళ్ళన్నీ అతకు సంఘీభావకంగా తనచుట్టూ నిలబడ్డాయి.

కాకా మనస్సులో తన యజమాని నాయుడు అతని కుటుంబం మెదిలింది. నాయుడికి తమ పట్ల ఉన్న అనుబంధం కూడా కాకా మదిలో మెదిలింది. అతడిపట్ల తమ జాతికి ఉండవలసిన విశ్వాసం కూడా కాకాకు సుస్పష్టమయింది.

'నాయుడూ జర భద్రం' కాకా పైకే అనేశాడో స్వగతంలో అనుకున్నానని పైకే అన్నాడో తెలియదు.

కాని ఆ గదిలో ఆ మాటలే ఇంకా ప్రకంపిస్తూనే ఉన్నాయి. ●